ఫర్టిలైజర్ దుకాణాదారులు నిబంధనలు పాటించాలి

- జిల్లాలో అందుబాటులో 35వేల మెట్రిక్ టన్నుల ఎరువులు డీఏఓ శ్రీధర్‌రెడ్డి

ఫర్టిలైజర్ షాప్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి

నేరేడుచర్ల, జూలై 25 : ఎరువుల దుకాణాల యజమానులు నిబంధనలు పాటించాలని, ప్రతి రోజు అమ్మిన, దిగుమతి చేసుకున్న ఎరువుల వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్ రెడ్డి ఆదేశించారు. గురువారం నేరేడుచర్ల పట్టణంలోని ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను, స్టాక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానకాలం సీజన్‌లో జిల్లాలో 5.50 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు అవుతాయని అంచనా వేసినట్లు తెలిపారు. అందులో వరి 4.52 లక్షల ఎకరాలు, పత్తి 90వేలు, జీలుగ 4 వేలు, కంది 971 ఎకరాలు, పెసర్లు 3వేల ఎకరాల్లో సాగు అవుతుందని వ్యవసాయశాఖ అంచనా వేసిందన్నారు. ఈ సీజన్‌లో 50 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమై ఉండగా ప్రస్తుతానికి 35 వేల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎరువులను ఎమ్మార్పీకే విక్రయించాలని, అధిక ధరకు అమ్మితే కేసు నమోదు చేస్తామన్నారు. రైతులు లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దనే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలని, రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే మోతే, తిరుమలగిరి మండలాల్లో నకిలీ విత్తనాలు విక్రయించే వారిని గుర్తించి కేసులు నమోదు చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయల లోపు రుణం తీసుకున్న 56,270 మంది రైతులకు రూ.298 కోట్లు జమ చేసిందని తెలిపారు. రుణమాఫీ కాని రైతులు సమీపంలోని వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. పట్టాదారు పాస్‌పుస్తకం ఉన్న వారు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనంతరం స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయాన్ని సందర్శించారు. ఆయన వెంట ఏఓ జావిద్, ఏఈఓలు ఉన్నారు.

మాదక ద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం

- జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

మట్టపల్లి : సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్

నేరేడుచర్ల, జూలై 25 : మాదక ద్రవ్యాల రవాణాపై ఉక్కుపాదం మోపుతామని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. గురువారం నేరేడుచర్ల పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీడీఎస్ బియ్యం, గుట్కాలు, గంజాయి రవాణాను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు నిరంతరం నిఘా ఉంచామన్నారు. అక్రమంగా నిల్వ ఉంచిన పీడీఎస్ బియ్యం, గుట్కాలను పట్టుకున్నామన్నారు. పోలీస్ స్టేషన్లలో సిబ్బంది కొరతపై అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. కొత్త నియామకాలు చేపట్టగానే కొరత ఉన్న స్టేషన్లలో భర్తీ చేస్తామన్నారు. ఆయన వెంట కోదాడ డీఎస్పీ ఎం. శ్రీధర్‌రెడ్డి, హుజూర్‌నగర్ సీఐ చరమంద రాజు, ఎస్ఐ రవీందర్ నాయక్ ఉన్నారు.

చెక్‌పోస్టుల వద్ద అప్రమత్తంగా ఉండాలి

మఠంపల్లి : రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోని చెక్‌పోస్టుల వద్ద విధులు నిర్వహించే పోలీసులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. గురువారం మండలంలోని మట్టపల్లి కృష్ణానదిపై ఉన్న అంతరాష్ట్ర చెక్‌పోస్టును ఆయన సందర్శించారు. కృష్ణానదిపై ఉన్న బ్రిడ్జిని, పరిసర ప్రాంతాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. గంజాయి, గుట్కాలు, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అరికట్టాలని, వాహనాలను తనిఖీ చేయాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను సందర్శించి రికార్డులు తనిఖీ చేశారు. ఆయన వెంట ఎస్ఐ రామాంజనేయులు, ముత్తయ్య ఉన్నారు.

పోలీస్ స్టేషన్ల తనిఖీ

హుజూర్‌నగర్/గరిడేపల్లి: సూర్యాపేట ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ గురువారం హుజూర్‌నగర్, గరిడేపల్లి పోలీస్ స్టేషన్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎస్ఐలు ముత్తయ్య, సైదులు ఉన్నారు.

స్మితా సబర్వాల్‌పై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి

- వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేశ్

రాస్తారోకో నిర్వహిస్తున్న దివ్యాంగులు

గరిడేపల్లి, జూలై 25 : సివిల్స్‌లో దివ్యాంగులకు రిజర్వేషన్ అవసరం లేదంటూ అనుచిత వ్యాఖ్యలు చేసిన సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితాసబర్వాల్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ డిమాండ్ చేశారు. గురువారం గరిడేపల్లిలోని జాతీయ రహదారిపై సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. అనంతరం స్మితా సబర్వాల్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగులపై ఆమె చేసిన వ్యాఖ్యలను ఖండించాల్సింది పోయి అది ఆమె వ్యక్తిగత అభిప్రాయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడడం దురదృష్టకరమన్నారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో స్మితా సబర్వాల్‌పై ఫిర్యాదు చేశారు. దివ్యాంగులకు బీఆర్ఎస్ నాయకులు రాపోలు నవీన్, సీపీఎం నాయకుడు యాకూబ్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కుర్ర గోపి, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రం నరేశ్‌రెడ్డి, నాయకులు అశోక్, ఎల్లయ్య, నర్సింహ, మోహిత్‌పాషా పాల్గొన్నారు.

100 పడకల ఆస్పత్రి పనులు పూర్తి చేయాలి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య

సమావేశంలో మాట్లాడుతున్న తాటికొండ సీతయ్య

తిరుమలగిరి(తుంగతుర్తి), జూలై 25 : తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో గత కేసీఆర్ ప్రభుత్వం 100 పడకల ఆస్పత్రిని మంజూరు చేసి పనులు ప్రారంభించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక నెలరోజుల్లోనే పనులు నిలిచి పోయాయని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టర్‌కు బిల్లులు రాకపోవడంతో పనులు నిలిపి వేశాడని, బిల్లులు చెల్లించి పనులు పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఎమ్మెల్యే మందుల సామేల్ చొరవ చూపాలన్నారు. పేద ప్రజలకు సర్కారు వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో జిల్లా నాయకుడు గుండగాని రాములుగౌడ్, పట్టణాధ్యక్షుడు గోపగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

మేళ్లచెర్వు, జూలై 25 : మండల కేంద్రంలోని పలు దుకాణాల్లో గురువారం పోలీసులు సోదాలు నిర్వహించి నిషేధిత గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నారు. కలిదిండి నర్సింహారావు దుకాణంలో 12,740, చిన్నపంగు సుధాకర్ షాపులో 260 గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పరమేశ్ తెలిపారు. ప్రభుత్వ నిషేధిత గుట్కాను అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెరటితోటల పెంపకంపై విద్యార్థులకు అవగాహన

గరిడేపల్లి, జూలై 25 : మండలంలోని గడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పెరటి తోటల పెంపకంపై గురువారం కేవీకే శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గృహ విజ్ఞాన శాస్త్రవేత్త సుగంధి మాట్లాడుతూ పంటలపై రసాయనిక మందులు వాడడం వల్ల వాటి ప్రభావం మనపై పడుతుందన్నారు. పెరటితోటల పెంపకం వల్ల నాణ్యమైన పంట ఉత్పత్తులు పొందవచ్చన్నారు. శాస్త్రవేత్త ఆదర్శ్ పురుగుల మందుల పిచికారీ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో గుంతల పూడ్చివేత

మోతె, జూలై 25 : మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ పూర్తిగా గుంతల మయంగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాటిని పూడ్చేందుకు సాయం చేయాలని స్థానిక యువకులు రాఘవాపురం గ్రామ సమీపంలో ఉన్న తక్షు క్రషర్‌మిల్లు యజమాని వంగాల కిరణ్‌గౌడ్‌ను కోరారు. వెంటనే స్పందించిన ఆయన గురువారం రూ. 80 వేల సొంత ఖర్చుతో గుంతల్లో కంకర డస్ట్ నింపి పూడ్చివేయించారు. దాంతో స్థానికులు ఆయనను అభినందించారు.

సంపద వనాల్లో మొక్కలను సంరక్షించాలి : జడ్పీ సీఈఓ

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ అప్పారావు

తిరుమలగిరి, జూలై 25 : సంపద వనాల్లో మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని జడ్పీ సీఈఓ అప్పారావు ఆదేశించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు, వార్డు ఆఫీసర్లు, ఈజీఎస్ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. అనంతరం తొండ గ్రామంలో పారిశుద్య కార్యక్రమాలు పరిశీలించారు. వెలిశాల, తాటిపాముల, తొండ, గ్రామాల్లో దళితబంధు యూనిట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లాజర్, మున్సిపల్ కమిషనర్ రామ దుర్గారెడ్డి, ఎంపీఓ మారయ్య పాల్గొన్నారు.

గాయకుడు నరేశ్ కుటుంబాన్ని ఆదుకుంటాం

- ఎమ్మెల్యేలు సామేల్, వీరేశం, బీఎల్ఆర్

నరేశ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం

శాలిగౌరారం, జూలై 25: అకాల మరణం పొందిన తెలంగాణ మలి దశ గాయకుడు వేముల నరేశ్ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని తుంగతుర్తి, నకిరేకల్, మిర్యాలగూడ ఎమ్మెల్యేలు మందుల సామేల్, వేముల వీరేశం, బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మండలంలోని ఊట్కూర్ గ్రామంలో గురువారం నిర్వహించిన నరేశ్ సంతాప సభలో వారు పాల్గొని మాట్లాడారు. నరేశ్ మంచి కళాకారుడిని, ఎంతో మంది ప్రజలను తన పాటలతో చైతన్యవంతం చేశారని కొనియాడారు. నరేశ్ మరణం కళారంగానికే తీరని లోటు అన్నారు. అంతకు ముందు నరేశ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాటల సీడీని ఆవిష్కరించారు. అంతకు ముందు శాలిగౌరారం గ్రామానికి చెందిన మామిడిపెల్లి మాధవి మృతి చెందడంతో ఆమె కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ రజిని, ఎమ్మెల్యే వీరేశం సతీమణి వేముల పుష్ప, వేపూరి సోమన్న, అన్నెబోయిన సుధాకర్, బొడ్డు సోమలింగయ్య, నోముల జనార్దన్, వేముల గోపినాథ్, పడాల రమేశ్, పుల్లూరి దేవేందర్, జహంగీర్, నూక కిశోర్, ఈర్ల కిరణ్, వేముల భరత్ ఉన్నారు.

మాట్లాడుతున్న రీజినల్ డైరెక్టర్ కృష్ణమూర్తి

భూగర్భ జలాల పరిరక్షణలో భాగస్వాములు కావాలి

- సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు ఆర్‌డీ కృష్ణమూర్తి

రామగిరి, జూలై 25: భూగర్భ జలాల పరిరక్షణకు ప్రజలంతా బాధ్యతగా భాగస్వామై క్రియాశీలకంగా వ్యవహరించాలని సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు రీజినల్ డైరెక్టర్ జి.కృష్ణమూర్తి తెలిపారు. నల్లగొండలోని ఎంజీయూలో డిపార్టుమెంట్ ఆఫ్ జియాలజీ, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు సంయుక్తంగా మూడ్రోజుల శిక్షణలో భాగంగా గురువారం రెండో రోజు హాజరై మాట్లాడారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌తో భూగర్భ జలాలు, ఫ్లోరోసిస్ తదితర అంశాలపై స్ఫూర్తి నింపేలా అవగాహన కల్పించారు. జలసాధన సమితి అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో వర్షపాతం, ఫ్లోరోసిస్ తదితర అంశాలను వివరించారు.

'చలో ఢిల్లీ'ని విజయవంతం చేయాలి

- టీఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉపేందర్

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న టీఎమ్మార్పీఎస్ నాయకులు

బొడ్రాయిబజార్, జూలై 25 : ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు ఇటుక రాజు ఆధ్వర్యంలో ఆగస్టు 6, 7 తేదీల్లో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగే ధర్నా, దీక్ష, పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాలను విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు కత్తి ఉపేందర్ మాదిగ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఖమ్మం క్రాస్ రోడ్డు అంబేద్కర్ విగ్రహం వద్ద కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టి ఆమోదించాలని డిమాండ్ చేశారు. వంద రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీఇచ్చిన బీజేపీ కేంద్రంలో మూడు సార్లు అధికారంలోకి వచ్చినప్పటికీ వర్గీకరణ చేయకుండా మాదిగలను మోసం చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు జానయ్య, ప్రధాన కార్యదర్శి బాషపంగు సత్యం, కార్యదర్శి కొత్తపల్లి వెంకన్న, జిల్లా ఉపాధ్యక్షులు పాతకొట్ల రమేశ్, కత్తి రవీందర్, జిల్లా కార్యదర్శి వగ్గు రాజు, నియోజకవర్గ అధ్యక్షుడు పిడమర్తి కమల్, నాయకులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో నెమలి మృతి

మృతిచెందిన నెమలి

మిర్యాలగూడ, జూలై 25: పట్టణంలోని ఇస్లాంపురంలో జనావాసాల్లోకి వచ్చిన జాతీయ పక్షి నెమలిపై కుక్కల దాడి చేయడంతో గాయపడి మృతి చెందింది. ఇస్లాం పురంలో నెమలిపై వీధి కుక్కలు దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఫారెస్ట్ అధికారులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకొని పరీక్షించి నెమలి మృతి చెందినట్లు నిర్ధారించారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసుకొని కాల్వపల్లి అటవీప్రాంతంలో ఖననం చేశారు. కాగా నెమలి ఎలా వచ్చిందనేది ప్రశ్నగా మారింది.

ఇంటింటికీ మొక్కల పంపిణీ

మొక్కలు పంపిణీ చేస్తున్న అధికారి సత్యనారాయణ

చిట్యాల, జూలై 25 : వన మహోత్సవంలో భాగంగా గురువారం మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో ఇంటింటికీ ఆరు మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి సిద్ది వీర సోమయ్య, వైద్యాధికారి మాధవి, ఫీల్డ్ అసిస్టెంట్ మర్రి రమేశ్ పాల్గొన్నారు.

వివాహిత మృతికి కారణమైన భర్త, అత్తామామలకు జైలు

హుజూర్‌నగర్ , జూలై 25 : అదనపు కట్నం కోసం వేధింపులకు గురి చేసి వివాహిత మృతికి కారణమైన భర్త, అత్తా మామలకు జైలు శిక్ష విధిస్తూ హుజూర్‌నగర్ రెండో అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ శ్యాంశ్రీ గురువారం తీర్పునిచ్చారు. వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా బోనకల్ మండలం ముష్టి కుంట్ల గ్రామానికి చెందిన బంధం శ్రావణి వివాహం మేళ్లచెర్వు మండలం కందిబండకు చెందిన కానుగు రవికుమార్‌తో 2014లో జరిగింది. వివాహ సమయంలో ఎకరం వ్యవసాయ భూమి, రూ.10 లక్షలు కట్నంగా ఇచ్చారు. వివాహమైన కొద్దికాలం తర్వాత శ్రావణి భర్త కానుగ రవికుమార్, మామ వెంకటేశ్వర్లు, అత్త రాజ్యం, ఆడపడుచు భాగ్యలక్ష్మి అదనపు కట్నం కోసం మానసికంగా, శారీరకంగా వేధించడం ప్రారంభించారు. వారి వేధింపులు తాళలేక ఫిబ్రవరి 2, 2017న శ్రావణి తన అత్తాగారింట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయమై శ్రావణి తండ్రి లక్ష్మాద్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పటి మేళ్లచెర్వు ఎస్ఐ రవికుమార్ కేసు నమోదుచేశారు. అప్పటి కోదాడ డీఎస్పీ రమణారెడ్డి దర్యాప్తు పూర్తి చేసి శ్రావణి భర్త రవికుమార్, మామ వెంకటేశ్వర్లు, అత్త రాజ్యం, ఆడపడుచు భాగ్యలక్ష్మిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన జడ్జి నిందితుల్లో ముగ్గురిపై నేరం రుజువు కావడంతో రవికుమార్‌కు పదేండ్లు, వెంకటేశ్వర్లు, రాజ్యంకు ఏడు సంవత్సరాల చొప్పున జైలు శిక్షను విధిస్తూ న్యాయమూర్తి డాక్టర్ శ్యామ్‌శ్రీ తీర్పు చెప్పారు.

27న వాహనాల వేలం

హుజూర్‌నగర్, జూలై 25 : వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు శనివారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో జిల్లా మద్య పాన నిషేధ అధికారి లక్ష్మానాయక్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించనున్నట్లు హుజూర్‌నగర్ ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనాలని సూచించారు.

రేషన్ బియ్యం పట్టివేత

కోదాడ రూరల్, 25: మండలంలోని గుడిబండ గ్రామంలోని ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 13 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు రూరల్ ఎస్ఐ అనిల్‌రెడ్డి తెలిపారు. నిందితుడు వాకా కుటుంబరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

- 1969 ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

బొడ్రాయిబజార్, జూలై 25 : కాంగ్రెస్ ప్రభుత్వం మానిఫెస్టోలో ప్రకటించిన విధంగా తొలి తెలంగాణ ఉద్యమకారులకు పెన్షన్, ఉచిత ప్రయాణం, వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని 1969 తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బొమ్మిడి లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సూర్యాపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా తెలంగాణ తొలి ఉద్యమకారులకు రూ. 25వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. ప్రస్తుతం చాలా మంది మరణించారని, రాష్ట్ర వ్యాప్తంగా 3,250మంది ఉద్యమకారులు మాత్రమే ఉన్నారన్నారు. తెలంగాణ బడ్జెట్‌లో ఉద్యమకారులకు తగిన నిధులు కేటాయించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం కోశాధికారి నరేంద్రాణి విద్యాసాగర్, సభ్యులు కొత్తూరు వెంకటేశ్వర్లు, చిత్రం భద్రమ్మ, బందు రుద్రమ్మ, కక్కిరేణి భారతమ్మ, పాలవరపు వెంకటేశ్వర్లు, జగిని దయానందం, కక్కిరేణి వెంకటేశ్వర్లు, కొమిరిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి : పీవైఎల్

అధికారికి వినతిపత్రం అందిస్తున్న పీవైఎల్ నాయకులు

బొడ్రాయిబజార్, జూలై 25 : జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని పీవైఎల్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక వైద్యశాఖ డెమో అంజయ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పీవైఎల్ జిల్లా కోశాధికారి బండి రవి మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో వివిధ ప్రాంతాల్లో మలేరియా, డెంగీ జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వైద్యశాఖ అధికారులు హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి చికిత్స అందించాలని కోరారు. పీహెచ్‌సీల్లో పాము, తేలు కాటుకు విరుగుడు మందులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో పీవైఎల్ పట్టణ నాయకులు వీరబోయిన లింగయ్య, దండి ప్రవీణ్, భీమ్‌రెడ్డి, వినయ్, మహేశ్, నవీన్ ఉన్నారు.

ఆస్తి వివాదంతో ఆగిన అమ్మ అంత్యక్రియలు

- మృతదేహం ఎదుటే కుమార్తెల గొడవ

కోదాడ టౌన్, జూలై 25: డబ్బు ముందు బంధాలు, బంధుత్వాలు కనిపించకుండా పోతున్నాయి. ఆస్తి కోసం కుమార్తెలు కన్న తల్లి అంత్యక్రియలు నిర్వహించకుండా ఆపిన ఘటన కోదాడ పట్టణంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడలోని పాత పోస్టాఫీసు వీధిలో నివాసముంటున్న వెల్దినేని నాగమణి(85), గోవిందరావు దంపతులకు ముగ్గురు కుమార్తెలు. గోవిందరావు లారీ డ్రైవర్‌గా పని చేస్తూ ముగ్గురు కుమార్తెలకు వివాహం చేశాడు. పదేండ్ల క్రితం గోవిందరావు మృతి చెందగా.. నాగమణి ఒంటరిగా జీవనం సాగిస్తున్నది. బుధవారం అనారోగ్యంతో ఆమె మృతి చెందింది. అయితే నాగమణి పేరు మీద కొంత స్థలం ఉండగా అది తమకే కావాలంటూ ముగ్గురు కుమార్తెలు గొడవకు దిగారు. తల్లి మృతదేహం ఇంట్లో ఉండగానే కూతుర్లు ఆస్తికోసం గొడవకు దిగడం స్థానికులను విస్మయానికి గురి చేసింది. వారి గొడవ తేలక పోవడంతో అంత్యక్రియలు నిలిచి పోయాయి. కుల పెద్దలు కల్పించుకొని కూతుర్లకు సర్ది చెప్పడంతో చివరకు గురువారం సాయంత్రం నాగమణి అంత్యక్రియలు నిర్వహించారు.

పౌష్టికాహారం పక్కదారి పడితే చర్యలు

- జిల్లా సంక్షేమ అధికారి సక్కుబాయి

కతాల్‌గూడ అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలతో మాట్లాడుతున్న సంక్షేమ అధికారి సక్కుబాయి

నీలగిరి, జూలై 25 : ప్రభుత్వం చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని పక్కదారి పట్టిస్తే చర్యలు తప్పవని మహిళ శిశు సంక్షేమ శాఖ అధికారి సక్కుబాయి హెచ్చరించారు. కతాల్‌గూడలోని అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆమె ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో స్టాక్, రికార్డుల్లో ఉన్న స్టాక్‌ను లెక్కించారు. రికార్డులు చాలా శుభ్రంగా ఉంచుకోవాలని, కొట్టివేతలు ఉండవద్దని, వైట్‌నర్లు వాడరాదని తెలిపారు. కార్యక్రమంలో షేర్‌బంగ్లా సూపర్‌వైజర్ మల్లేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గం ఎన్నిక

పాస్టర్స్ ఫెలోషిప్ మోతె మండల కార్యవర్గం

మోతె, జూలై 25 : మండల పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీని గురువారం మండలంలోని నామవరం ఫ్రెండ్స్ అసెంబ్లీ చర్చిలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్. లాజర్, ప్రధాన కార్యదర్శిగా పి. తిమోతి, ట్రెజరర్‌గా డి.ఎలీషా, ఉపాధ్యక్షుడిగా జయరాం నాయక్, కోఆర్డినేటర్‌గా ఎం. జాక్షన్, కమిటీ సభ్యులుగా ఇర్మియ, రత్నం, కోటేశ్, దానియేలు, దావీద్, మోష ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ చైర్మన్ శ్రావణ్‌కుమార్, కోదాడ నియోజకవర్గ అధ్యక్షుడు సుదర్శం, వర్కింగ్ ప్రెసిడెంట్ జోసఫ్ పాల్గొన్నారు.

ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ మండల కార్యవర్గం

చిట్యాల, జూలై 25 : ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ మండల కమిటీని గురువారం జిల్లా గౌరవాధ్యక్షుడు ఏళ్ల బయ్యన్న, జిల్లా సహాయ కార్యదర్శి ముప్ప సుఖేందర్‌రెడ్డి అధ్యక్షతనఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దేవనబోయిన సైదులు, ప్రధాన కార్యదర్శిగా కూరాకుల సుధీర్, కోశాధికారిగా చొప్పరి లింగస్వామి, సలహాదారుడిగా గాలా యాదగిరి, మెండె నర్సింహ, ఉపాధ్యక్షుడిగా బయ్యా రవి, సిలువేరు రమేశ్, సత్తయ్య, నరేశ్, సహాయ కార్యదర్శులుగా అచ్చయ్య, శేఖర్, వేణు, ప్రచార కార్యదర్శిగా జిట్ట నరేశ్, కార్యవర్గ సభ్యులుగా ఉపేందర్, ప్రణయ్, మల్లేశ్ ఎన్నుకున్నారు.

ఏజెన్సీ ప్రాంత కల్లుగీత కార్మికుల సమస్యలపై మంత్రికి వినతి

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి విభాగం అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్

తిరుమలగిరి(నాగారం), జూలై 25 : ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న కల్లుగీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ గౌడ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మొల్కపురి శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, తాడి కార్పొరేషన్ చైర్మన్ బుర్ర వెంకటేశం, బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శిని హైదరాబాద్‌లో కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తెలంగాణ గౌడ సంక్షేమ సంఘం ఏజెన్సీ జిల్లా అధ్యక్షుడు రవి, వాసు, గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగ సదానందం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండాల మల్లేశ్, ఎల్లయ్య, సత్తయ్య, రణధీర్, సందీప్, సోమశేఖర్, ముత్తయ్య, శ్రీను, అవులయ్య పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

CHANGE OF NAME
I, MOPURI KONDAL REDDY S/o. Linga Reddy, R/o. H.No. 3-99/1, Nampally Road, Gurrampode (V) & (M), Nalgonda (D) have changed my Surname as MOPOORI instead of MOPURI for all purpose

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం... మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం

నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777196 | చౌటుప్పల్ : 9182777638